రేపు బీజీఎస్ సంస్థాపక దినోత్సవం

బెంగళూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆదిచుంచనగిరి మఠాధిపతిగా వ్యవహరించిన బాలగంగాధరనాథస్వామీజీ (బీజీఎస్) కాలంలో ఏర్పాటైన విద్యాసంస్థలు ప్రగతిదశలో ఉన్నాయి. ఆదిచుంచనగిరి శిక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం బీజీఎస్ సంస్థాపక దినోత్సవాన్ని, సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించనుంది. కెంగేరిలోని బీజీఎస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సిటీలో శుక్ర, శనివారాలలో రెండురోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ట్రస్టు ముఖ్యులు ప్రకాశనాథస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

రెండున్నరేళ్లలో ఎన్నెన్నో.. మతలబులు..!



పగ్గాలు చేపట్టిన వేళ రాహుల్‌గాంధీతో సిద్దరామయ్య, డీకే శివకుమార్ (ఫైల్)

● ఇద్దరు మంత్రులపై వేటు ● నాయకత్వ మార్పు దిశగా అడుగులు ● అధిష్టానం నిర్ణయంపైనే ఆశలు

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటితో రెండున్నరేళ్ల పాలన ముగుస్తోంది. ఇప్పటిదాకా ఓ లెక్క, రానున్న రోజుల్లో మరో లెక్క అనేలా నాయకత్వ మార్పు విషయమై రెండునెలలుగా వేడెక్కిన రాజకీయం ఢిల్లీపెద్దల మౌనంతో ఆశావహులకు నిరాశే మిగిలింది. 30 నెలల పాలనలో ఎన్నెన్నో రాజకీయ, పాలనాపరమైన మతలబులు చోటు చేసుకున్నాయి. నిత్యం అధికార, పార్టీపరమైన వేదికలపై సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ అన్యోన్యంగా కనిపిస్తున్నా అవకాశం కోసం ఇద్దరూ వేచి చూస్తున్నారనడంలో ఆశ్చర్యమేమి లేదు. ప్రస్తుతం దేశంలో అభివృద్ధిలో పరుగులు పెడుతున్న రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది కేవలం కర్ణాటకలో మాత్రమే అని చెప్పకతప్పదు. దక్షిణభారత్‌లోనే తెలంగాణ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నా కర్ణాటక తరహా పరిస్థితి అక్కడ లేదని చెప్పవచ్చు. 2018 నుంచి ఏడాదిన్నరపాటు జేడీఎస్‌తో కలసి కాంగ్రెస్ ప్రభుత్వం నడిపినా పార్టీ ముఖ్యులకు ఏ కోశానా ఉత్సాహం లేదనేలానే కొనసాగింది. ఆ తర్వాత 2019 మూడున్నరేళ్ల బీజేపీ పాలన సాగుతున్న తరుణంలోనే కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా పార్టీ అధ్యక్ష పదవిని డీకే శివకుమార్‌కు అప్పగించింది. అప్పటి దాకా స్తబ్దుగా సాగిన కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మేకెదాటు కోసం పాదయాత్ర ద్వారా పార్టీ నాయకులందరినీ ఒకతాటిపైకి తీసుకువచ్చారు. అంతలోనే అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర కర్ణాటకలోనే భారీ స్పందన వచ్చింది. అందుకు మూలకారణం డీకే శివకుమార్ అనేది తెలిసిందే. ఇక 2023 శాసనసభ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే మూడున్నరేళ్ళ బీజేపీ ప్రభుత్వంపై అవినీతి మరకను ప్రజలలోకి తీసుకెళ్లడంలో సత్ఫలితం సాధించారు. ఎన్నికలకు దాదాపు నాలుగైదు నెలల ముందు నుంచే ప్రజలలోకి వెళ్లి ఐదు గ్యారెంటీలను విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతి గ్యారెంటీని రాష్ట్రస్థాయిలో సభలు నిర్వహించి అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వంటి నేతల ద్వారా విడుదల చేయించారు. తద్వారా రాష్ట్ర నాయకులు కాదు గ్యారెంటీల అమలుకు మాది భరోసా అనేలా ప్రజలలో నమ్మకం కల్పించారు. ఇలా కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెంచుకుంటూనే మరోవైపు బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందనేలా ప్రచారానికి అప్పటి సీఎం బసవరాజ్‌బొమ్మై చిత్రంతోనే 40శాతం కమీషన్ అనే పోస్టర్ల ద్వారా విస్తృతంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలలోకి తీసుకెళ్ళారు. ఇలా ఎన్నో కుట్రలు, గ్యారెంటీల విశ్వాసం వంటి కారణాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు ఎక్కువ స్థానాలలో హస్తం అభ్యర్థుల గెలుపునకు ప్రజలు ఆశీస్సులు లభించాయి. మ్యాజిక్ నంబర్ 113 కాగా ఏకంగా 130కుపైగా స్థానాలతో ప్రభుత్వం ఏర్పడేందుకు వీలు కలిగింది. ఈ ఫలితాలతో ఇటు రాష్ట్ర నేతలు అటు అధిష్ఠానం కూడా సంతోషంగా ఉన్న తరుణంలోనే ముఖ్యమంత్రి పదవిపై భారీ గందరగోళం సాగింది. ఎన్నికలకు ముందుగానే ముఖ్యమంత్రిని ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్‌కు లేదనేది మరోసారి రుజువు చేయడంతో తాను సైతం అంటూ సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు పోటీ పడ్డారు. ఏకంగా ఢిల్లీలో మకాం వేసి వారం రోజులపాటు తగ్గేదేలేదనే రీతిలో ఇద్దరూ వ్యవహరించారు. అధిష్ఠానం భిన్నమైన రీతిలో సంప్రదింపులు, చర్చలు, ఆశలు, అవకాశాలు కల్పించి ఎట్టకేలకు సిద్దరామయ్యను ముఖ్యమంత్రిగా ప్రకటించారు. కానీ డీకే శివకుమార్ కోరుకున్న ఉపముఖ్యమంత్రితోపాటు భారీ జలవనరులు, బెంగళూరు నగరాభివృద్ధిశాఖలతోపాటు కేపీసీసీ అధ్యక్ష పదవిలో యథావిధిగా కొనసాగించేలా తీర్మానం జరిగింది.

● నేటితో రెండున్నరేళ్లు పూర్తి

2023 మే 20న సిద్దరామయ్య ప్రభుత్వం ప్రారంభమైంది. ఇలా గురువారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ల పూర్తి అవుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పుడే క్యాబినెట్‌లో ఖాళీలు లేకుండా సంపూర్ణంగా భర్తీ చేశారు. 34మందితో పూర్తిబెర్త్‌తో పాలన సాగింది. కానీ ఏడాదిలోగానే బీసీ సంక్షేమ శాఖ నుంచి 187 కోట్ల నగదు బదిలీ వెనుక భారీ అవినీతి బయటపడటం, ఏకంగా 87కోట్ల దాకా అవినీతి జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించి కేసులు నమోదు చేయడంతో మంత్రి నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇలా సిద్దు క్యాబినెట్‌లో తొలివికెట్ పడినట్లు అయ్యింది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓటుచౌర్యంపై జాతీయ స్థాయిలో పోరాటంగా సాగిస్తున్న విధానంపై వ్యతిరేకంగా మాట్లాడారని సహకారశాఖ మంత్రి కేఎన్ రాజణ్ణను ఏకంగా క్యాబినెట్ నుంచి ఉద్వాసన పలికారు. ఇలా క్యాబినెట్‌లో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఏడాది తర్వాత క్యాబినెట్‌లో మార్పులు ఉంటాయని ప్రచారం జరిగినా లోక్‌సభ ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. కానీ ఏకంగా పదిమంది మంత్రులకు లోక్‌సభ టిక్కెట్లు ఇచ్చి రాష్ట్ర రాజకీయాలనుంచి తప్పించాలనే ఎత్తుగడ సాగింది. జిల్లాల వారిగా పలుకుబడి కలిగిన సీనియర్‌లకు టికెట్‌లు ఇచ్చేలా రాష్ట్ర పార్టీ అధిష్ఠానంకు వివరించింది. కానీ కేవలం ఏడాదిలోపే మరోసారి ఎన్నికలకు వెళ్ల లేమని, అయితే ఖర్చులు ఇతరత్రా భరించి మా వారసులకు రాజకీయ అరంగేట్రం చేస్తామని మెలిక పెట్టారు. మరో మార్గం లేకుండా వారసులకు అధిష్ఠానం పచ్చజెండా చూపింది. ఇలా పలువురు మంత్రుల కుమారులు, కుమార్తెలు, భార్యలు ఒక్కసారిగా లోక్‌సభకు వెళ్లారు

● ప్రభుత్వంపై పెరుగుతున్న అవినీతి ఆరోపణలు

ఇటీవల ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వంపై చేసిన 40శాతం కమీషన్ ఆరోపణలు ప్రస్తుత కాంగ్రెస్ పాలనపైనా వస్తున్నాయి. కాంట్రాక్టర్‌ల సంఘం ముఖ్యులు బీజేపీ పాలన కంటే ఘోరంగా కమీషన్‌ల డిమాండ్ ఉందంటూ ఇటీవల బహిరంగంగానే ఆరోపించారు. కమీషన్‌లకు సంబంధించి సాక్ష్యాలు ఉం టే ఇవ్వాలని, కోర్టులకు వెళ్లవచ్చునని సీఎం, డీఎస్‌లు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ ప్రభుత్వంలో ఎస్‌ఐ పోస్టుల అవినీతి జరిగినా పార్టీతో సంబంధం లేనివారే పట్టుబడ్డారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 87 కోట్లకుపైగా అవినీతిని ఈడీ వెలుగులోకి తెచ్చింది. కానీ స్థానిక సిట్ మాత్రం నిర్దోషిగా ప్రకటించింది. సీఎం సిద్దరామయ్య భార్య పేరిట 'ముడా' పరిధిలో 14 ఇంటి స్థలాలు పొందడం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. సంపూర్ణంగా కేసులు రద్దు కాకపోయినా సిట్ మాత్రం క్లీన్‌చిట్ ఇచ్చింది.

● అన్నదాతల ఆత్మహత్యలు


అన్నదాతల ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. మండ్య జిల్లా అధికారి కార్యాలయం ఎదుటే ఓ రైతు అన్యాయం జరిగిందని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను కొన్నాళ్ల చికిత్సలు పొంది మృతి చెందాడు. చెరకు రైతుల పోరాటం తారస్థాయికి చేరినా టన్నుకు రూ.3,300 చెల్లించేలా ఒప్పందం కుదరడంతో చెరకు రైతులు నిరసన విరమించారు. చెరుకు రైతుల పోరాటం ఇంకా సద్దుమణగలేదు. బెళగావి జిల్లాలో రైతులు నిరసన విరమించినా బాగల్‌కోటె జిల్లాలో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల రెండు ప్రాంతాలలో చెరుకుతో పాటు ట్రాక్టర్‌లకు నిప్పుపెట్టి అన్నదాతలు నిరసన తెలిపారు.

● అభివృద్ధికి గ్రాంట్ల కొరత

గ్యారెంటీ పథకాలకు ఏడాదికి 56 వేల కోట్ల రూపాయలకుపైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ పరిణామం అభివృద్ధి పనులకు కొట్టొచ్చినట్టు లోటు కనిపిస్తోంది. ఏడాది క్రితం ప్రకటించినా గ్రాంట్లు రాలేదని, సొంత పార్టీ ఎమ్మెల్యే రాజుకాగె అభ్యంతరం వ్యక్తం చేశారు. పలు అంశాలపై బహిరంగంగా విమర్శలు చేసిన ఎమ్మెల్యే బీఆర్ పాటిల్‌కు ఎప్పటికప్పుడు పదవులలో పదోన్నతి కల్పించినట్టుగా అవకాశాలు ఇవ్వడంతో నోరు మెదపకుండా మిన్నకుండిపోయారు. గ్యారెంటీల ద్వారానే అభివృద్ధికి గ్రాంట్లు కష్టంగా మారాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పలు సందర్భాలలో బహిరంగ వ్యాఖ్యలు చేశారు. ఏడాది కిందట ప్రకటించిన ఎమ్మెల్యేల గ్రాంట్లలో పూర్తిస్థాయిలో విడుదల కాలేదనే విమర్శలున్నాయి. పైగా కేంద్రప్రభుత్వంతో సానుకూలం దొరణి కాకుండా ప్రతి విషయంలోను సీఎంతో పాటు పలువురు మంత్రులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీను టార్గెట్ చేసినట్లుగా ఆరోపణలు చేస్తుంటారు. కేంద్రంనుంచి రెండేళ్ళకిందట కరువుకు సంబంధించిన గ్రాంట్‌లు సుప్రీం కోర్టును ఆశ్రయించి విడుదల చేయించుకోవాల్సి వచ్చింది. తాజాగా ఐటీ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే ఆర్‌ఎస్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్రమైన పరిణామాలు చూపుతాయనే అభిప్రాయాలు సొంత పార్టీ నాయకుల్లో ఉన్నాయి.

● తేనెతుట్టె కదిలేనా..?

రెండున్నరేళ్ల పాలన ముగుస్తున్న తరుణంలో తేనెతుట్టెను కదిపినట్లు అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది కీలకం కానుంది. మంత్రివర్గ మార్పు ఉంటుందని ఇప్పటికే సీఎం సిద్దరామయ్య సూచన ప్రాయంగా ప్రకటించారు. అయితే నాయకత్వ మార్పు ఉంటుందని మరోవర్గం బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. తాజాగా ఢిల్లీ టూర్‌లు పెరిగిపోయాయి. ఈనెల 14న బిహార్ ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే ఢిల్లీ వెళ్లి రెండు మూడు రోజులు అక్కడే ఉంటానని సీఎం సిద్దరామయ్య తెలిపారు. డీసీఎం డీకే శివకుమార్ కూడా నవంబరులో దాదాపు ఐదారు రోజుల పాటు ఢిల్లీలోనే గడిపారు. సీఎం సిద్దరామయ్య వర్గీయులు కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని భావిస్తుండగా డీసీఎం డీకే శివకుమార్ వర్గీయులు ఏకంగా నాయకత్వ మార్పుపైనే ఆశలు పెట్టుకున్నారు. 15, 17వ తేదీలలో ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఇద్దరు అగ్రనేతలు ఖంగుతిన్నారు. అగ్రనేత రాహుల్ గాంధీ విస్తరణకు సానుకూలంగా పార్టీ అధ్యక్షులతో చర్చించాలని శనివారం ముఖ్యమంత్రికి సూచించారు. కానీ ఆదివారం పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేను కలిసి డిమాండ్‌లు, ప్రతిపాదనలు పెట్టారు. అంతలోనే సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్ళి పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేతో చర్చల వేళ ఎటువంటి మార్పులు వద్దంటూ కొట్టిపారేశారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండున్నరేళ్ళ పాలన సందర్భంగా జరిగే మార్పులు ఏవీ ఉండవని తేలిపోయింది. కేపీసీసీ అధ్యక్ష పదవిని డీకే శివకుమార్ వదులుకునేందుకు సిద్ధమైనట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని నెలల్లోనే మార్పులు అనివార్యమని పార్టీ వర్గాలలో చర్చలు ఉన్నాయి. రెండున్నరేళ్ళుగా సజావుగా సాగిన పాలన భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలకు కారణమవుతుందనేది చర్చనీయాంశంగా ఉంది.



అంజనాద్రి పర్వతం మెట్లమార్గంపై భక్తులు వెలిగించిన జ్యోతులు

ఎటు చూసినా జ్యోతులే..!

కంప్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలో కిష్కింద ఆంజనేయస్వామి జన్మించిన అంజనాద్రి పర్వతంపై బుధవారం ఎటు చూసినా జ్యోతులే కనిపిస్తున్నాయి. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం వేళ కింది నుంచి పర్వతంపై వరకు భక్తులు కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జ్యోతులు వెలిగిస్తూ స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. కార్తీకమాసం చివరి రోజు కావడంతో అమావాస్య ముందుగానే దివ్య జ్యోతులు వెలిగిస్తూ స్వామివారికి పూజలు చేశారు. రాష్ట్రంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు దేశ విదేశాల నుంచి హంపికి చేరుకుని అక్కడి నుంచి అంజనాద్రి పర్వతానికి చేరుకుని స్వామివారికి పూలు పండ్లు సమర్పించి దర్శించుకున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లో చేరే బీసీలు, దళితులను ఏమనాలి?

● సీఎం సిద్దరామయ్య అసంతృప్తి

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడినవర్గాలు, దళితులకు వ్యతిరేకమైన బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో చేరేవారిని ఏమనాలని సీఎం సిద్దరామయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో బీసీ కులాల సమాఖ్య ఏర్పాటు చేసిన ఎల్‌జీ హావనూరు నివేదిక సువర్ణ మహోత్సవంలో సీఎం పాల్గొన్నారు. దేవుడు, మతం పేరిట కొట్టుకునేవారంతా వెనుకబడినవర్గాలే అన్నారు. స్వార్థం కోసం వీరే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూలం అనేలా మాట్లాడతారని ఎద్దేవా చేశారు. హావనూరు నివేదికను దేవరాజ్ అరసు బీసీల బైబిల్ అని పిలిచారన్నారు. సుప్రీంకోర్టు కూడా నివేదికను అభినందించిందన్నారు. ఓ పల్లెలో ఎస్టీ కుటుంబంలో జన్మించిన హావనూరు విద్యార్థి దశలోనే పోరాటం చేసి న్యాయవాది అయ్యారన్నారు. నేను ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు వంద గొర్రెలు లెక్కపెట్టలేరు, బడ్జెట్ ఎలా ప్రవేశపెడతారని ఎద్దేవా చేసినవారు ఉన్నారన్నారు. ఇప్పటికి 16 బడ్జెట్‌లు ప్రవేశపెట్టానని, 17వది కూడా సాధ్యం చేస్తానన్నారు. 1991లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో నామినేషన్ వివాదం కావడంతో నా తరపున హావనూరు వాదించారన్నారు. కుల వ్యవస్థ ఎప్పటి దాకా ఉంటుందో రిజర్వేషన్లు అప్పటివరకు అనేది అంబేడ్కర్ ఆశయమన్నారు. విద్యావంతులు మూఢనమ్మకాలను వీడాలన్నారు. బుద్ధ, బసవణ్ణ, అంబేడ్కర్‌లు కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినవారన్నారు. రిజర్వేషన్లను 75శాతం పెంచేందుకు సిద్ధమని, నా రాజకీయం నా ప్రాణం ఉన్నంతవరకు సామాజిక న్యాయానికి కట్టుబడతానన్నారు.



హావనూరు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

బూదిగెరెలో కెనరా బ్యాంకు 10వేల శాఖ

● ప్రారంభించిన సీఎండీ సత్యనారాయణరాజు

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ కెనరా బ్యాంకు మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. బెంగళూరు నగరం బూదిగెరె క్రాస్‌లో కొత్తశాఖను ప్రారంభించడం ద్వారా 10వేల శాఖకు చేరింది. బుధవారం కెనరాబ్యాంకు వ్యవస్థాపకులు అమ్మంబళ్ సుబ్బారావు పాయ్ స్మరణార్థం 120వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కెనరాబ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సత్యనారాయణరాజు శాఖను ప్రారంభించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం.నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎండీ సత్యనారాయణ మాట్లాడుతూ ఖాతాదారులకు ఉత్తమమైన సేవలు అందించడమే మా లక్ష్యమన్నారు. కొత్తశాఖలో అనుభవం ఉన్న సిబ్బంది, డిజిటల్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఖాతాదారుల అనుభవాలను సులభతరం చేసేలాంటి విధానాలు అమలు చేస్తున్నామన్నారు. కెనరాబ్యాంకు 1906లో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం రూ.26,78,963 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 3,172, సబర్బన్‌లో 2,980, నగరాలలో 1,968, మెట్రో నగరాలలో 1,881 శాఖలు ఉండగా 10,903 ఏటీఎంలు ఉన్నాయన్నారు. బ్యాంకు వ్యవస్థాపకులను స్మరించుకునే రోజునే కొత్తశాఖన తెరవడం సంతోషంగా ఉందన్నారు. కాగా అలపాడ్‌లో కొత్తశాఖ ప్రారంభంతో 10,001కు చేరింది. కార్యక్రమంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



కెనరా బ్యాంకు శాఖ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎండీ సత్యనారాయణ రాజు



ఇందిరాగాంధీ జయంతి సభలో పాల్గొన్న సీఎం, డీసీఎం

కేపీసీసీకి నిరంతర అధ్యక్షుడిని కాను

● డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేపీసీసీ అధ్యక్ష పదవిని వదులుకునేందుకు డీకే శివకుమార్ సిద్ధమైనట్టు తెలుస్తోంది. బుధవారం కేపీసీసీలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య పాల్గొని ఇందిరాగాంధీ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. డీకే మాట్లాడుతూ కేపీసీసీ అధ్యక్షుడిగా 2020లో బాధ్యతలు చేపట్టానని ఇప్పటికి ఐదేళ్లు ముగిసి ఐదు నెలలైందన్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే అధ్యక్ష పదవిని వదులుకునేందుకు సిద్ధమయ్యానన్నారు. కానీ అగ్రనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే కొనసాగాలంటూ ఆదేశించానన్నారు. వచ్చే మార్చి నాటికి ఆరేళ్లు నిండనుందన్నారు. ఇతరులకు అవకాశం ఇవ్వాల్సిందేనన్నారు. ఇదే సమయంలో కార్యకర్తలు నినాదాలు చేశారు. మరికొందరు మీరే అధ్యక్షులుగా ఉండాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన డీకే శివకుమార్ నేను ఉంటానో లేదో అనేది ముఖ్యం కాదని నాయకత్వం సూచించే ఏ పదవిలో ఉన్నా పార్టీకోసం పనిచేస్తానన్నారు.

నారా భువనేశ్వరికి సాదర స్వాగతం

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి బెంగళూరు విమానాశ్రయంలో బుధవారం సాదర స్వాగతం లభించింది. నాలుగురోజుల కుప్పం పర్యటన కోసం భువనేశ్వరి విమానం ద్వారా వచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లో బెంగళూరు టీటీడీ ఆలయ స్థానిక సలహా కమిటీ చైర్మన్ కనకమేడల వీర శాలువాతో సత్కరించారు. బెంగళూరు టీడీపీ ఫోరంకు చెందిన సోంపల్లి శ్రీకాంత్, టీడీపీ కర్ణాటక కన్వీనర్ రావిమోహన్ చౌదరి, చనుమోలు శివ, నారాయణ, పాండు, లెనిన్, శరణ్య, నీలిమ, శోభ పాల్గొన్నారు.



విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ ఫోరం సభ్యులు



రూ.100 నాణేన్ని విడుదల చేస్తున్న పీఎం మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు, సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్ తదితరులు

విశ్వ ప్రేమికుడి వేడుక

● పర్తికి తరలివచ్చిన భక్తజనం
● హిల్ వ్యూ స్టేడియంలో సందడి
● సత్యసాయి సేవలను కొనియాడిన ప్రధాని మోదీ

పుట్టపర్తి, టౌన్, రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పుట్టపర్తిలో వైభవంగా సాగుతున్నాయి. హిల్‌వ్యూ స్టేడియంతో బుధవారం నిర్వహించిన వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి (మిగతా 6లో..)



సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ



చిన్నారికి సుకన్య పథకం పాసు పుస్తకం అందజేస్తున్న ప్రధాని మోదీ



వసంత లక్ష్మి కూచిపూడి నృత్య ప్రదర్శన



సత్యసాయి స్టాంపులను ఆవిష్కరిస్తున్న ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు



ప్రధాని మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విశ్వ ప్రేమికుడి వేడుక

(5వ పేజీ తరువాయి)

ఐశ్వర్యరాయ్ బచ్చన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ తదితరులు హాజరయ్యారు. దేశవిదేశాలకు చెందిన సేవ, రాజకీయ, క్రీడా, సినీ రంగాల ప్రముఖులు వేడుకలలో పాల్గొన్నారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి, ప్రశాంతి నిలయంలో నుంచి హిల్ వ్యూ స్టేడియానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కాన్వాయ్ వెళుతుండగా భక్తులు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి అభివాదం చేశారు. సాయిరాం.. సాయిరం అని నినాదాలు చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతు మందిరంలో సత్యసాయి మహాసమాధి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. సత్యసాయి సువర్ణ విగ్రహం ఎదుట కాసేపు కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం వంద మంది రైతులకు గిర్ ఆవులను ప్రధాని పంపిణీ చేశారు. గోవులకు గడ్డి తినిపించారు.



పుట్టపర్తి ప్రధాన వీధిలో భక్తుల సందడి



అన్ని దారులూ అటు వైపే..

సత్యసాయి శత జయంతి వేడుకలలో పాల్గొనేందుకు దేశ విదేశీ భక్తులు, ఉమ్మడి జిల్లా, స్థానిక భక్తులు, సామాన్యులు తరలివచ్చారు. హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాలకు బుధవారం తెల్లవారు జాము నుంచే క్యూ కట్టారు. పట్టణంలోని అన్ని దారులు స్టేడియంవైపై అన్నట్లు భక్తులు తరలివెళ్లారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పట్టణంలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఈశ్వరమ్మ చిత్రపటం

వేదికపై ప్రముఖులు

హిల్ వ్యూ స్టేడియంలోని ప్రధాన వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆశీనులయ్యారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్ మాట్లాడుకుంటూ కనిపించారు. అందరూ కలిసి సత్యసాయి స్మారక నాణేలను, తపాలా బిల్లలను ఆవిష్కరించారు. సత్యసాయి సేవలను, ఆయనతో తమకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 30 లక్షల మందికి సత్యసాయి తాగునీరు అందించడం, ఒడిశాలో వరద బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్య, వైద్య సేవలను తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయిబాబా జీవిత చరిత్ర, మహిమలు, అధ్మాత్మిక, విద్య, వైద్య సేవలకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను డిజిటల్ స్ర్కీన్స్‌పై ప్రదర్శించారు. సంగీత దర్శకుడు శివమణి డ్రమ్స్, గాయకులు సుధ, రఘునాథన్ బృందం సంగీత కచేరి భక్తులను అలరించాయి. వసంతలక్ష్మి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీమతి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల, సత్యసాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గుజరాతీ నృత్యం, వర్ద డ్యాన్స్‌తో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు.



హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు





సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



వేడుకల్లో విదేశీ భక్తురాలు





సాయికుల్వంత్ హాలులో గేయాలు ఆలపిస్తున్న భక్తులు, హారతి ఇస్తూ..



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ శ్యాంప్రసాద్



ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి



మహాసమాధి పక్కనే కుర్చీ

● ప్రముఖుల హాజరు



హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పాల్గొన్నారు.

● ఆత్మీయ పలకరింపులు



సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్ తదితరులు వేదికపై ఆత్మీయంగా పలకరించుకున్నారు. సత్యసాయితో ఉన్న బంధాలను నెమరువేసుకున్నారు. సభ ముగియగానే సత్యసాయి మహా మంగళ హారతి పట్టారు. ప్రధాని, సీఎం సహా అందరూ లేచి నిలబడి హారతి గీతంలో గళం కలిపారు. చేతులు జోడించి లీనమైపోయారు.

● ప్రధానికి ఘనస్వాగతం





సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం 9.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస వర్మ, అనగాని, సవిత, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరా రెడ్డి, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జీఎం శేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, వెంకటశివుడు తదితరులు స్వాగతం పలికారు.

● కొత్త కానుకలు



ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న అనంతరం రైతులకు ట్రస్టు తరఫున ప్రధాని మోదీ గోదానం చేశారు. ముగ్గురు రైతులకు గిర్ ఆవులను అప్పగించారు. ఈ పథకం కింద మొత్తం వంద మంది రైతులకు గిర్ అవులను ఇచ్చారు. హిల్‌వ్యూ స్టేడియంలో పరిగి మండలానికి చెందిన జాహ్నవి, లయ, నల్లమాడ మండలానికి చెందిన సుమిత్ర బాయికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు తరఫున సుకన్య సమృద్ధి యోజన పోస్టల్ ఖాతా పాస్ పుస్తకాలను అందించారు.

● మార్మోగిన శివమణి డ్రమ్స్



శివమణి బృందం డ్రమ్స్ వాయిద్యంతో హిల్ వ్యూ స్టేడియం మార్మోగింది. కేరళ వాయిద్య కళాకారులతో అరగంటపాటు డ్రమ్స్, కొమ్ము వాయిద్యంతో భక్తులను ఉర్రూతలూగించారు. రెండు చేతులతో ఏకకాలంలో నాలుగు డ్రమ్ములను వాయిస్తూ అబ్బురపరిచారు.

● ముఖ్యమంత్రికి వీడ్కోలు

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి విమానాశ్రయంలో పలువురు నాయకులు, అధికారులు వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు నాని, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.





'సత్యసాయి 1940లో తన 14వ ఏట 'అందిరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సేవా మార్గాన్ని కుగ్రామమైన పుట్టపర్తిలో ప్రారంభించారు. సత్యసాయికి జన్మభూమి, కర్మభూమి పుట్టపర్తి. సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే వందేళ్లపాటు చేయబోయే సేవలకు పునాది కావాలి. సత్యసాయి సేవలు, బోధనలు, ప్రేమతత్వానికి విశ్వవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. సేవాదళ్ ఉంది. వీరందరూ సత్యసాయి సేవా మార్గంలో పయనించి, ఎనలేని సేవలు అందిస్తున్నారు. సత్యసాయి శివైక్యం అయిన తరువాత 15 సంవత్సరాలుగా సత్యసాయి సేవలను పారదర్శకంగా కొనసాగించడం మీ వల్లే సాధ్యమైంది. ఇదంతా సత్యసాయి ఆధ్యాత్మిక తత్వంతోనే సాగుతోంది. శతజయంతి వేడుకలకు హాజరైన ప్రపంచ వ్యాప్త సత్యసాయి కుటుంబానికి ధన్యవాదాలు..'

\- ఆర్‌జే రత్నాకర్



'అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన భగవాన్ సత్యసాయి బాబా రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన జల్ జీవన్ మిషన్ తరహాలో ఆయన ఈ ప్రాంత దాహార్తి తీర్చారు. జల్ జీవన్ మిషన్‌కు అంకురమే ఆయన చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు. ఏ ప్రభుత్వాలూ ఆలోచించని సమయంలోనే భగవాన్ సత్యసాయిబాబా ఈ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించాలని తలంచారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు సత్యసాయి తాగునీటి పథకానికి బాబా రూ.400 కోట్లు ఇచ్చారు. చంద్రబాబు అండగా నిలిచి సత్యసాయి సాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన సేవాతత్వరకు ఎంత మంది ప్రభావితం అయ్యారో లెక్కే లేదు. ప్రపంచానికి వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి ఇక్కడ పుట్టడం మనందరి అదృష్టం'

\-ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



'మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ సత్యసాయి బాబా మన మధ్యలోనే ఉంటారు. మనం నిజం మాట్లాడితే సత్యసాయిబాబా మనతోనే ఉంటారు. అందరినీ ప్రేమించు... అందరికీ సేవ చేయి.. ఎవరినీ బాధించకు.. అని ఆయన చూపిన బాటలో మనమంతా నడవాలి. భగవాన్ చూపిన పవిత్ర మార్గాన్ని అనుసరిస్తూ శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, శ్రీసత్యసాయి సేవా సంస్థలు సమాజానికి విశేషమైన సేవలను అందిస్తున్నాయి. పేదలకు ప్రేమతో సహాయం అందించాలని బాబా చెప్పిన మాటలు నాకు స్ఫూర్తి. భగవాన్ చెప్పినట్లుగా పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పడం నా ధ్యేయం. మనుషుల్లో దేవుడిని చూశారు భగవాన్... ప్రేమతో ప్రపంచాన్ని గెలిచారు..'

\- ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్

నన్ను సాయిబాబా అనే వారు..



ఐదేళ్ల వయస్సులో పాఠశాలలో, బయట నా జుట్టును చూసి సాయిబాబాలా ఉన్నాడు అనే వారు. అప్పట్లో నాకు ఏదీ అర్థమయ్యేదికాదు. సత్యసాయి బాబా దర్శనంతో నాకు అసలు విషయం అర్థమైంది. 19 ఏళ్ల వయస్సులో మొదటిసారి వైట్‌ఫీల్డ్‌లో సత్యసాయి దర్శనం చేసుకున్నాను. ఆ తరువాత పలుమార్లు సత్యసాయి దర్శనానికి వెళ్లాను. ఇదే స్టేడియంలో 1997లో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో క్రికెట్ ఆడాం.. విజయం సాధించాం. అవన్నీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. సత్యసాయిని ఎన్నో ప్రశ్నలు అడగాలని అనుకున్నాను. కానీ అడగలేకపోయాను. ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదని, ఒక నిర్ణయానికి రాకూడదని సత్యసాయి అప్పట్లో చెప్పేవారు.

\-సచిన్ టెండూల్కర్

నేనూ బాలవికాస్ విద్యార్థినే..



ఆనాడు, ఈనాడు నేను బాలవికాస్ విద్యార్థినే. సత్యసాయి బాలవికాస్ విద్య ద్వారానే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. బాలవికాస్ విద్య బాల్యంలోనే విలువలను, క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను బోధిస్తుంది. భవిష్యత్తుకు మూలం ఇది. జీవితానికి విద్య ఒకటే ప్రమాణికం కాదు, విలువలు, సామాజిక స్పృహ, సేవాభావం వంటివి కావాలన్నది సత్యసాయి బోధనల తత్వం. సత్యసాయి బాబా ప్రేమ, సేవ, దయకు సరిహద్దులు లేవు. ఏపీ, కర్ణాటక, తమిళనాడులో లక్షలాది మందికి తాగునీరు అందించడం, గ్రామీణాభివృద్ధి, యువత శక్తి వృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేయడం బాబా అపారమైన సేవాశక్తికి నిదర్శనం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు సత్యసాయిబాబా జీవితం. ఈ విలువలను మనం ఆచరణలో పెట్టడమే నిజమైన భక్తి.

\- ఐశ్వర్యారాయ్ బచ్చన్, బాలీవుడ్ నటి

నేడు పుట్టపర్తికి కేంద్రమంత్రి గడ్కరీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో పాల్గొనేందుకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. ఆయన ఉదయం 6.30 గంటలకు నాగపూర్ విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుని, సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతి గురించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి నాగపూర్ బయలుదేరతారు.

రాష్ట్ర మంత్రులు కూడా..

భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. సత్యసాయి శతజయంతి వేడుకలు ముగిసేవరకు ఆయన పుట్టపర్తిలోనే ఉంటారు. జయంతి వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కూడా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి గురువారం వస్తున్నారు.


ప్రశాంతి నిలయంలో నేడు..

సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి ప్రపంచ సదస్సు నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి గడ్కరీ హాజరవుతున్నారు. ప్రపంచ శాంతి కోసం జరిగే ఈ సదస్సులో 45 దేశాలకు చెందిన 2500 మంది ప్రతినిధులు పాల్గొంటారు. సాయంత్రం యువత భక్తిగీతాల ఆలాపన ఉంటుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

లియో టాల్‌స్టాయ్ (వర్ధంతి)



రష్యా దేశ ప్రముఖ రచయిత, సాహితీవేత్త లియో టాల్‌స్టాయ్ 1828 సెప్టెంబరు 9న జన్మించారు. వార్ అండ్ పీస్ (1869), అన్నా కరెనినా (1877) నవలలు ఎంతో పేరొందాయి. ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ విథిన్ యూ (1894) అనే రచన 20వ శతాబ్దంలో ఎందరినో ప్రభావితం చేసింది. ఆయన నాటికలతో ఫిలాసఫీపై రచనలు చేశారు. మిలిటరీ సర్వీస్‌లో కొన్ని కవితలు కూడా రాసి సైనికులను ఉత్తేజ పరిచారు. ఆయన రచనలకు పలుమార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ అయినా దక్కకపోవడం గమనార్హం. 1910 నవంబరు 20న కన్నుమూశారు.

ఆలయ ఆవరణలో కూతురిపై తల్లి కొడవలితో దాడి

▸ బెంగళూరులో దారుణం

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో భయంకరమైన సంఘటన చోటు చేసుకుంది. పెళ్లి అయి ఇద్దరు పిల్లలు ఉన్న కుమార్తె తరచూ తల్లి ఇంటికి వస్తున్నకారణంగా ఇద్దరిమధ్యా వాగ్వాదం చోటు చేసుకునేది. మూడు రోజులక్రిందట మరోసారి ఇద్దరు పిల్లలతో కుమార్తె పుట్టింటికి వచ్చారు. బుధవారం అమావాస్య కావడంతో కుమార్తెను బలి ఇవ్వాలని భావించారా.. మానసికంగా ఇబ్బంది పడుతున్నారో తెలియదు గానీ తెల్లవారుజామున 4 గంటలకే సంపిగెహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్రహార లేఅవుట్ హరిహరేశ్వర ఆలయాలనికి తల్లీ కు మార్తె వెళ్లారు. తెల్లవారుజామున వీరిద్దరూ ఎందుకు వెళ్తున్నారని స్థానికులు గమనించారు. అయితే మేం గుడికి వెళ్లకూడదా..? అంటూ తల్లి సరోజమ్మ స్థానికులపై మండిపడ్డారు. ఆ తర్వాత తల్లి సరోజమ్మ, కుమార్తె రమ్య (22) లు గుడివద్దకు వెళ్లారు. పూజా సామగ్రితోపాటు సరోజమ్మ కొడవలిని కూడా వెంట తెచ్చుకున్నారు. ఇద్దరూ కలసి కాసేపు పూజ చేశారు. తర్వాత సాష్టాంగ నమస్కారం చేయాలని తల్లి సూచించడంతో రమ్య అదే తరహాలోనే మొక్కుకుంటుండగా ఒక్కసారిగా కొడవలితో దాడి చేశారు. తలభాగంలో పలుమార్లు కొడవలితో విచక్షణారహితంగా దాడి చేశారు. రమ్య ఆర్తనాదాలు చేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. అప్పటికే తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయారు. హుటాహుటిన రమ్యను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. స్థానికుల సమాచారంతో సంపిగెహళ్ళి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితురాలు సరోజమ్మకోసం గాలింపులు జరుపుతున్నారు. కుమార్తెను నర బలి ఇవ్వడానికి ప్రయత్నించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రమ్యకు కొన్నేళ్లక్రితం సోమశేఖర్ అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్త ఇంట్లో చిన్న గొడవ జరిగినా రమ్య పుట్టింటికి వచ్చేసే వారు. తరచూ ఇలా రాకూడదని తల్లి మందలించేవారు. రమ్యతోపాటు ఇద్దరు పిల్లలకు అనారోగ్యం కావడంతో మూడురోజులక్రితం భర్త సోమ శేఖర్‌తోపాటు పుట్టింటికి వచ్చారు.

గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు



గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొత్త గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌ను డీప్ వాచ్ కంపెనీ లాంఛనంగా ప్రారంభించింది. బుధవారం కంపెనీ కార్యాలయాన్ని శ్రీకారం చుట్టింది. డీప్ వాచ్ కంపెనీ అత్యాధునిక సెంటర్ కానుంది. సాఫ్ట్‌వేర్, ఏజెంటిక్ ఏఐ, సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ల ప్రతిభా సమూహాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సెంటర్ పనిచేయనుందని కంపెనీ సీఈఓ జాన్ బిలుల్లో అభిప్రాయపడ్డారు. సెంటర్ ద్వారా నగరంలో ఔత్సాహిక స్టార్టప్‌లకు, యువతకు అనుకూలం కానుందన్నారు. డీప్‌వాచ్ ఇండియా ఎండీ ప్రసాద్ చన్నబసప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకోండి

కంప్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. కురుగోడులో బుధవారం కంప్లి నియోజకవర్గంలోని సంచార జాతులపై ఎస్సీ, ఎస్టీ గిరిజన వర్గాల గుడారాలకు ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం అందించిన టార్పాలిన్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని హక్కిపిక్కి సిండోల్లో డోంగ్రిగరాషి, శిలేఖ్యత, సుడుగాడు సిద్ధ, తెగ, జంగం, హండి, జోగి, ఇతర సంచార జాతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో స్థలాలు, ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం సులభతరం చేస్తుందని హామీ ఇచ్చారు. అలేమారి, అరి అలేమారి మహాసభ అధ్యక్షుడు శివకుమార్, శికారి రాము, హనుమంతప్ప, జోగి సుంకప్ప హండిజోగి, హులుగప్ప, సుడుగాడు సిద్ధ, ఇతర సంచార జాతుల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కంప్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ పంచాయతీ అధికారులు నళిని, యాస్మిన్ సూచించారు. పట్టణంలోని 18 వార్డులో స్వచ్ఛ జాగృతి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఇళ్లలోని చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పట్టణ పంచాయతీ వాహనాల్లో వేసి స్వచ్ఛతను కాపాడాలని కోరారు. సంపదపై ఎలాగైతే దృష్టి సారిస్తామో అలాగే స్వచ్ఛతపైన కూడా ప్రతి ఒక్కరు దృష్టి వుంచాలన్నారు. మన ఆరోగ్యం బాగుండాలంటే చుట్టూ ఉన్న ప్రదేశాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. పట్టణ పంచాయతీ ద్వారా ఇచ్చే తడి, పొడి చెత్త బాక్సుల్లో ఉదయం వచ్చే వాహనాల్లో వేయాలన్నారు. తరచూ వర్షపాతం వర్షాలు పడుతుండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు.

రోబోటిక్ టెక్నాలజీతో నీటి అక్రమ కనెక్షన్‌లకు చెక్

▸ బ్లూ ఫోర్స్‌కు శ్రీకారం: డీసీఎం డీకే శివకుమార్



బ్లూ ఫోర్స్‌ను ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక రోబోటిక్ టెక్నాలజీ వినియోగించుకోవడం ద్వారా నీటి అక్రమ కనెక్షన్‌లకు చెక్ పెట్టనున్నట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో బ్లూ ఫోర్స్, రోబోటిక్ టెక్నాలజీ అమరికను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి చేపట్టిన కార్యాచరణను జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాత్ మనోహర్ వివరించారు. డీసీఎం మాట్లాడుతూ బెంగళూరు ప్రజలకు శుద్ధమైన నీటిని అందించే బాధ్యత ప్రభుత్వం ఉందని, ఇందుకుగాను జలమండలి సరికొత్త ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందన్నారు. నీటి అక్రమ కనెక్షన్లపై కఠిన చర్యలు తప్పవన్నారు. రామ్‌ప్రసాత్ మనోహర్ మాట్లాడుతూ బ్లూ ఫోర్స్‌లో 16 విభాగాలు ఉంటాయని, ఒక్కో బృందంలో ముగ్గురు సిబ్బంది ఉంటారని ఈ వారంనుంచే కార్యాచరణలో పాల్గొంటారన్నారు. సాంకేతికత వల్ల పైప్‌లైన్‌లోపల పరిస్థితి ఖచ్చితంగా గుర్తించవచ్చునని ఏఐ టెక్నాలజీతో లీకేజీ స్థలాన్ని గుర్తించవచ్చునన్నారు. మండలి ముఖ్య కార్యదర్శి మదన్‌మోహన్, చీఫ్ ఇంజనీర్ బీఎస్ దలాయత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం



స్వామివార్లకు అలంకరణ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కుంబిగానహళ్ళి గ్రామపంచాయతీ హెచ్ క్రాస్‌లో పురాణ ప్రసిద్ధమైన సీతారామాంజనేయ స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ధార్మిక కైంకర్యాలు, విశేషపూజలు, మహామంగళారతి నిర్వహించారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ రథోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడుతూ భగవంతుడి కృపతో ఉత్తమ వర్షాలు, పంటలు పండాలని ఆకాంక్షించారు. ధార్మిక కార్యక్రమాలతో ప్రజలమధ్య ఐక్యత, శాంతి, సహకార మనోభావం పెరుగుతాయన్నారు. ఉత్సవమూర్తులను సీతారామలక్ష్మణ, అంజనేయస్వామిలను అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ, కళాకారుల సందడి మధ్య రథోత్సవం సాగింది. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన అయ్యప్పస్వామి బృందాన్ని, స్థానిక సభ్యుడు చంద్రణ్ణ సహకారాన్ని కాంగ్రెస్ నాయకుడు ఖళనాయకనహళ్ళి భీమేశ్ ప్రశంసించారు. జాతరలో వివిధ రకాల తినుబండారాలు విక్రయించారు. పిల్లల ఆటవస్తువులు ఆకర్షణీయంగా నిలిచాయి.

ఇష్టమైన రంగంలోనే విజయం

▸ మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్




గౌరవ డాక్టరేట్‌తో మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌కు సన్మానం

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఆశించినదాని వెంబడి పరుగెత్తవద్దని, మిమ్మల్ని ప్రోత్సహించే మార్గంలో నడిస్తే విజయం వరిస్తుందని మాజీ క్రికెటర్ డాక్టర్ బీకే వెంకటేశ్ ప్రసాద్ పేర్కొన్నారు. జైన్ (డీమ్డ్ టుబి యూనివర్సిటీ) 15వ స్నాతకోత్సవంలో డాక్టర్ హానరిస్ కాసను ప్రదానం చేశారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీకే సీతారాం, జైన్ వర్సిటీ కులపతి డాక్టర్ చిన్నరాజ్ రాయ్‌చంద్, వీసీ (ఇన్‌చార్జ్), రిజిస్ట్రార్ జితేంద్రకుమార్, ప్రో-వైస్ చాన్సలర్ డాక్టర్ దినేశ్ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు. డాక్టరేట్ అందుకున్న వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆసక్తి కల్గిన రంగంలో రాణిస్తే విజయం సాధ్యమన్నారు. ఇంజనీరింగ్ అయినా, ఏఐ అయినా మీకు ఇష్టమైన రంగంలో సాగితే లక్ష్యాలు అందుకోవచ్చునన్నారు. స్నాతకోత్సవంలో వివిధ విభాగాలలో 127 బంగారు పతకాలు, 30,439 మందికి పట్టాలను, 92 పీహెచ్‌డీలను ప్రదానం చేశారు.

రాజ్యాంగ ఆశయాల కోసం పాదయాత్ర

▸ ప్రతిపక్షనేత అశోక్



మీడియాతో ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆశయాలను ఎత్తి చూపాలనే ఈనెల 26నుంచి భీమ పాదయాత్ర నిర్వహిస్తున్న ప్రతిపక్షనేత అశోక్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ ద్రోహం చేయడమే ఆశయంగా కొనసాగిందన్నారు. బుధవారం నగరంలో పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ అని, భారతరత్న ఇవ్వకుండా జాప్యం చేసింది కాంగ్రెస్ అన్నారు. కనీసం ఆయన సమాధికి స్థలం కూడా ఇవ్వలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంబేడ్కర్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గ్రేటర్ బెంగళూరులో చెత్త ఊడ్చే యంత్రాల బాడుగకు రూ.613 కోట్లు కేటాయించదలిచారన్నారు. ఇందులో భారీ కుంభకోణం ఉందన్నారు. యంత్రాలు కొనుగోలు చేస్తే రూ.308 కోట్లు అవుతుందని, కానీ అద్దె రూపంలో తెచ్చుకుని మోసం చేయదలిచిందన్నారు. కాగా చిక్కమగళూరు మెడికల్ కళాశాల జనరిక్ ఔషధాల టెండర్లలో గోల్‌మాల్ చేశారని బీజేపీ నేత సీటీ రవి మండిపడ్డారు. పార్టీ కార్యాలయం జగన్నాథభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ చిక్కమగళూరు మెడికల్ కళాశాలను ఇటీవల పరిశీలించానన్నారు. జనరిక్ ఔషధాల టెండర్లలో అవినీతికి పాల్పడ్డారన్నారు. సాధారణంగా ఎంఆర్‌పీ కంటే తక్కువకు ఇచ్చే కంపెనీలకు టెండర్లు కేటాయిస్తారని, అయితే భారీ ధరలు పెంచి టెండర్లు వేశారన్నారు.

డబ్బుకోసం హతమార్చారు

▸ రూ.40 లక్షలకుపైగా అప్పు వాపసు అడిగినందుకు..

▸ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య - ఇద్దరి అరెస్టు



శ్రీనాథ్ (ఫైల్)



పోలీసుల అదుపులో నిందితులు

దొమ్మసంద్ర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బు వాపసు అడిగినందుకు చిన్నాన్న కొడుకును హతమార్చిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఆనేకల్ తాలూకా అత్తిబెలె పోలీస్‌స్టేషన్ పరిధిలో నగదు వ్యవహారం నేపథ్యంలో సొంత చిన్నాన్న కొడుకును హత్యచేసి ఇంట్లోనే గొయ్యితీసి పూడ్చిపెట్టిన వైనం బయటపడింది. శ్రీనాథ్ (32) సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ కుప్పంకు చెందిన వ్యక్తి. ఎలక్ట్రానిక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆనేకల్ బరగానహళ్ళిలో భార్యతో కలసి ఉంటున్నాడు. అక్టోబరు 24న శ్రీనాథ్ ఇంటికి రాకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాఘవ్‌గౌడ నేతృత్వంలో పోలీసులు, స్నేహితులతో కలసి పలుచోట్ల విచారించారు. అయితే ఎలాంటి ఆధారం లభించలేదు. ఈ నేపథ్యంలో శ్రీనాథ్ మొబైల్ ఆధారంగా చివరిసారిగా చిన్నాన్న కొడుకు ప్రభాకర్‌తో మాట్లాడినట్టు గుర్తించి ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించగా లాయర్‌తో కలసి హాజరవుతాననడంతో మరిన్ని అనుమానాలకు దారి తీసింది. అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు వెల్లడించాడు. ప్రభుత్వ ఆశ్రయ పథకం కింద ఇంటిసైట్‌ను పొంది అమ్మేవాడు ప్రభాకర్. ఈ తరుణంలో శ్రీనాథ్ వద్ద భారీగా నగదు ఉందని గుర్తించి పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని మైండ్‌వాష్ చేశాడు. ఇలా శ్రీనాథ్ నుంచి రూ.40లక్షలకుపైగా నగదు, బంగారం తాకట్టు పెట్టించి మరికొంత నగదు తీసుకున్నాడు. ఇటీవల శ్రీనాథ్ నగదు వాపసు ఇవ్వాలనడంతో ప్రభాకర్ ఖంగు తిన్నాడు. హతమార్చాలని కుట్ర పన్నాడు. పథకం ప్రకారం ఇంటి ఆవరణలే గొయ్యి తీశాడు. కుప్పం వెళ్లిన శ్రీనాథ్‌ను రమ్మని చెప్పాడు. నిర్మాణదశలో ఉన్న ఇంట్లో శ్రీనాథ్ నిద్రించినవేళ అతడి తలపై ప్రభాకర్ బలమైనరాయి వేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని ముందుగా తీసిన గొయ్యిలో పూడ్చి పెట్టాడు. విచారణలో డబ్బు వాపసు అడిగినందుకే హత్యచేశానని ప్రభాకర్ అంగీకరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసులో ప్రభాకర్‌కు సహకరించిన జగదీశ్ కూడా అరెస్టు అయ్యాడు.

ఆవణిలో పౌతి ఖాతా అదాలత్



అదాలత్‌లో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ముళబాగిలు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆవణి నాడకచేరి వద్ద రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పౌతిఖాతా అదాలత్‌ను బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ పిత్రార్జిత ఆస్తి హక్కును కుటుంబ సభ్యులకు బదిలీ చేసేందుకు పౌతిఖాతా దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజలు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌతిఖాతా లేకపోవడంతో రైతులు బ్యాంకు రుణం, పంటల బీమా, పంటనష్ట పరిహారం, భూస్వాధీన పరిహారం వంటివి పొందలేకపోతున్నారన్నారు. తమ పూర్వీకుల మరణ ధ్రువీకరణపత్రం, వంశవృక్షం, వారసుదారుల ఆధార్‌కార్డు వంటివి సమర్పించడం ద్వారా పౌతిఖాతాను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఇంటి ముంగిటకే సేవలు పొందేలా అదాలత్ నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు అదాలత్‌లో పాల్గొని వినతులు అందచేశారు.

విద్యాసంస్థలు గుణాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

▸ సీఎంఆర్‌లో 12.82 కోట్ల ప్రోత్సాహకాల పంపిణీ



మంత్రి రామలింగారెడ్డి, డాక్టర్ కేసీ రామమూర్తి తదితరులు

బెంగళూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంతో పోటీ పడే సాంకేతిక కాలంలో విద్యాసంస్థలు గుణాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అభిప్రాయపడ్డారు. సీఎంఆర్ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొత్త అకడమిక్ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యులుగా పాల్గొన్న రామలింగారెడ్డి మాట్లాడుతూ బెంగళూరు అంటే ప్రపంచమే గమనించేస్థాయికి చేరామని అందుకు విద్యాసంస్థల సహకారం కూడా ఉందన్నారు. సీఎంఆర్ గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ కేసీ రామమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల గౌరవార్థం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏటా జరుపుతున్నామన్నారు. ఇక్కడి విద్యార్థులకు ప్రోత్సాహకంతోపాటు సిబ్బందికి ప్రత్యేక నగదు బహుమతులు అందచేస్తామన్నారు. ఈ ఏడాది మెరిట్ విద్యార్థులకు 12.82 కోట్ల రూపాయలు స్కాలర్‌షిప్‌లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఎస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ కేపీ గోపాలకృష్ణ, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు డాక్టర్ సీ హొన్నప్పగౌడ సహా వీసీ డాక్టర్ సబితా రామమూర్తి, జగన్నాథరెడ్డి, జయదీప్ కేఆర్ రెడ్డితోపాటు డాక్టర్ త్రిస్థా రామమూర్తి, డాక్టర్ హెచ్‌బీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి రష్ ల్యాండ్స్ లక్ష విరాళం



ఎమ్మెల్యే బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న రష్‌ల్యాండ్స్ ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నందమూరి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్టుకు రష్‌ల్యాండ్స్ కంపెనీ లక్ష రూపాయలు విరాళం ప్రకటించింది. హిందూపురం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే, పద్మభూషణ్ గ్రహీత నందమూరి బాలకృష్ణను రష్‌ల్యాండ్స్ కంపెనీ ప్రతినిధులు భేటీ అయ్యారు. రష్‌ల్యాండ్స్ కంపెనీ కొడికొండ హిల్స్ ఫారం ల్యాండ్ ప్రాజెక్టును చేపడుతోంది. హిందూపురం నియోజకవర్గంలోని కొడికొండలో భారీ ప్రాజెక్టు చేపడుతున్నట్టు తెలిపారు. కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీశ్, రష్‌ల్యాండ్స్ పార్ట్‌నర్ గంగరాజు, మేనేజింగ్ పార్ట్‌నర్ ఎంవీ సత్యనారాయణ, పార్ట్‌నర్‌లు అనీప్‌రెడ్డి, వేణుగోపాలరెడ్డిలు ఎమ్మెల్యే బాలకృష్ణను కలిశారు. ఎంతోమంది పేదలకు క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి తమవంతు లక్ష రూపాయల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ రష్‌ల్యాండ్స్ ప్రతినిధులను అభినందించారు. రష్‌ల్యాండ్స్ ప్రతినిధులు బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇందిరాగాంధీ సేవలు అపూర్వం



ఇందిరాగాంధీ విగ్రహవిష్కరణలో సౌమ్యరెడ్డి తదితరులు

బొమ్మనహళ్ళి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉక్కుమహిళ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు అపూర్వమని, దేశం కోసం ప్రాణాలు వీడారని, దేశంకోసం ఎన్నో సేవలందించారని కేపీసీసీ మహిళా అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం జేపీనగర్ సారక్కి సర్కిల్‌లో ఇందిరాగాంధీ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ నేతృత్వంలో కార్యక్రమం ఏర్పాటైంది. పేదలు, బడుగు బలహీనవర్గాలకు కూడు, గూడు అందించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు. ఆమె కుటుంబం త్యాగానికి మారుపేరన్నారు. కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్ అహ్మద్, ఓ మంజునాథ్, రఘునాథ నాయుడు, మంజుళ, పటేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించే వేదిక



ప్రతిభాకారంజి ప్రారంభోత్సవంలో బీఈఓ శశికళ తదితరులు

బంగారపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా కారంజి అనేది పిల్లల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసే వేదిక అని బీఈఓ ఎంకే శశికళ అన్నారు. బూదికోటె హోబళి యశేసంద్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటైన క్లస్టర్‌స్థాయి ప్రతిభాకారంజిలో పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం, పోటీతత్వం పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో తాలూకా ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి శ్యామమూర్తి, జిల్లా కార్యదర్శి అప్పయ్యగౌడ్, సోమశేఖర్, బీఆర్‌పీ మంజునాథ్, సీఆర్పీఈ మాగేరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరును క్వాంటం సిటీగా మారుస్తాం

● టెక్ సమ్మిట్‌లో మంత్రి బోసరాజు



సదస్సులో పాల్గొన్న మంత్రి బోసరాజు, వివిధ సంస్థల ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): బెంగళూరును దేశంలో తొలి క్వాంటం సిటీ రూపకల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్ఎస్ బోసరాజు అన్నారు. టెక్ సమ్మిట్ రెండో రోజు బుధవారం రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. కర్ణాటక క్వాంటమ్ మిషన్ ద్వారా వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టదలిచామన్నారు. నగరంలో స్థాపించే క్వాంటమ్‌సిటీ దేశానికే ప్రముఖ కేంద్రం కానుందన్నారు. క్వాంటమ్ సూపర్‌మసీ సెంటర్‌ను ఇటీవలే పరిశీలించి వచ్చామన్నారు. క్వాంటమ్ సిటీలో అత్యాధునిక పరిశోధన ల్యాబ్‌లు, హార్డ్‌వేర్ పార్క్, క్వాంటమ్ క్లౌడ్ డేటా క్లస్టర్‌లు, డీప్‌టెక్, స్టార్టప్, క్రయోజనిక్, సూక్ష్మ పరీక్షా కేంద్రాలు రానున్నాయన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

సిరుగుప్ప నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఇటిగేహాళ్ గ్రామం నుంచి అనువాళ్ గ్రామం వరకు రూ.95 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. తాలుకాలోని కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఈ మార్గంలో తారు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ నిధుల కింద ఈ పనులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ తిప్పేస్వామి, ఇంజనీర్లు శ్రీనివాస, శాంతరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి మిల్లును సందర్శన: పట్టణంలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు బుధవారం సందర్శించారు. ఆదోని రోడ్డు మార్గంలో పత్తి మిల్లును ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు సందర్శించి అక్కడ రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పత్తి కొనుగోలు కేంద్రం లేక మద్దతు ధర దక్కక రైతులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఎమ్మెల్యే సంబంధిత మంత్రులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. పత్తిమిల్లు యజమానులు కొండయ్య, కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్ దేశాయి. మణికంఠనాయక, మోహన్, గణేష్, రాము పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.21	1630.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,654	4,076
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,205	6,929
నీటి నిల్వ (టీఎంసీలు)	73.94	97.18

మిర్చి యార్డు నిర్మాణానికి స్థల గ్రహణం

- వర్క్ఆర్డర్ ఇచ్చి నాలుగు నెలలైనా ప్రారంభంకాని పనులు
- స్థానిక ఎమ్మెల్యే లేఖతో ఆగిన నిర్మాణం
- మిర్చి రైతులకు అందని ద్రాక్షలా యార్డు
- వృథా అవుతున్న పోరాటాలు



హాలదల్లి గ్రామం వద్ద మిర్చిమార్కెట్, కోల్డ్ స్టేరేజీ నిర్మాణానికి కేటాయించిన స్థలం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ప్రస్తుతం బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన మిర్చి యార్డు పరిస్థితి. ఏపీఎంసీ శాఖ నిర్ణయించిన స్థలంలో కాకుండా మరో ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు లేఖ రాయడంతో పనులు అర్థంతరంగా ఆయిపోయాయి. ఈ విషయం బయటకు పొక్కనీయకుండా స్థానిక నేతలు జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. దీంతో చిల్లీ యార్డ్‌కు స్థల గ్రహణం పట్టినట్లు అయింది. అన్నీ సక్రమంగా జరిగి ఈ పనులు ప్రారంభం కావాలంటే మరో ఏడాది వేచి చూడాల్సిందేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎంసీల అభివృద్ధి శాఖ అధికారులు అన్ని సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకునే కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం స్థానిక ప్రజా ప్రతినిధుల లేఖ కారణంగా అటు ప్రభుత్వానికి, ఇటు రాష్ట్రస్థాయి నిర్ణయానికి చెంపపెట్టుగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం బళ్లారి జిల్లా మిర్చి రైతుల కష్టానికి స్పందించిన అప్పటి బీజేపీ ప్రభుత్వం మిర్చియార్డ్, కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక జిల్లాధికారికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2022 సంవత్సరంలో బళ్లారి తాలూకా పరిధిలో హలదహళ్ళి గ్రామ పరిధిలో 25 సర్వే నంబరులో రెవెన్యూ ఉద్యోగుల నివాసాలకు కేటాయించిన స్థలంలో 25/బీ సర్వే నంబరులో 18 ఎకరాలు, 25/ఎ/2 సర్వేలో నంబరులో 5.03 ఎకరాలు మొత్తం 23 ఎకరాలు స్థలసేకరణ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపింది. రాష్ట్ర ప్రభుత్వం నబార్డ్ బ్యాంకు నిధుల కింద మార్కెట్ నిర్మాణానికి రూ.5 కోట్లు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రూ.11 కోట్లు చొప్పున యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అనుమతి కోసం నబార్డ్ సంస్థకు అందజేసింది. దీంతో 2022-23 మధ్యలోనే నబార్డ్ అధికారులు, రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌కు చెందిన రాష్ట్రస్థాయి అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు నాలుగైదు సార్లు స్థలపరిశీలన చేసి మార్కెట్ నిర్మాణానికి సరైన స్థలంగా గుర్తించారు. అప్పటి అధికారుల సూచనలతోనే అవసరమైన రికార్డులు సిద్ధం చేసి నబార్డ్, ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.10కోట్ల వ్యయంతో 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ఫిబవరి 7న ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు పిలిచారు. ఈ పనులను స్థానికంగా ఉన్న శ్రీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకోవడంతో పనులు ప్రారంభించాలని జూలై 20న స్థానిక ఏపీఎంసీ సెక్రటరీ పనులు ప్రారంభించేందుకు వర్క్ ఆర్డర్ అందజేసింది. అయితే సరిగా నేటికి కాంట్రాక్టర్‌కు వర్క్‌ఆర్డర్ అందకుని నాలుగు నెలలు కావస్తున్నా... ఇంతవరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ఆంధ్రజ్యోతి వివరాలు సేకరించగా... స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వానికి రాసిన సిఫార్సు లేఖ కారణంగా ఆగిపోయాయని తెలిసింది. ప్రభుత్వం ఎమ్మెల్యే సిఫార్సు లేఖకు ప్రభుత్వం తలొగ్గుతుందా... లేదా గతంలో సూచించిన స్థలంలోనే కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ఆదేశాలు జారీ చేస్తుందా అనే విషయంపై వేచి చూడాల్సిందే.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అండర్-17 బాలికల షటిల్ పోటీల్లో నగరానికి చెందిన సముధ్యిత ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది. విద్యార్థిని మాట్లాడుతూ గత నెలలో కొప్పళలో జరిగిన డివిజన్‌స్థాయి పోటీల్లో రాణించి, 17న రాయచూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే పోటీల్లో రాణించి బళ్లారి జిల్లాకు కీర్తి తెస్తామని ధీమా వ్యక్తం చేసింది. విద్యార్థినిని ఉపాధ్యాయులు, కోచ్‌లు అభినందించారు.

పారా స్విమ్మర్ల ప్రతిభ



ప్రతిభ కనబరచిన స్విమ్మర్లతో కోచ్‌లు

బళ్లారి సిటీ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలిలో 15 నుంచి 18 వరకు నిర్వహించిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బళ్లారికి చెందిన నలుగురు పారా స్విమ్మర్లు ప్రతిభ కనబరిచినట్లు కోచ్‌లు రజనిలక్కా, శరత్ గైక్వాడ్ తెలిపారు. గోపీచంద్, సాయి నిఖిల్, బేబీ సాయి, యోజిత్ కర్ణాటక తరఫున ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు. గోపీచంద్‌కు మూడు బంగారు పతకాలు, ఒక రజత సాధించారు. సాయి నిఖిల్ వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్య పతకం, వంద మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకాన్ని సాధించారు. బేబీ సాయి వంద మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో బంగారు, యోజిత్ వంద మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకాన్ని గెలుపొందారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బళ్లారి గ్రామీణ శాసనసభ్యుడు నాగ్రేంద, నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కలెక్టర్ నాగ్రేంద ప్రసాద్, ఎస్పీ శోభారాణి అభినందించారు.

23న ఆయుర్వేద వైద్యశిబిరం

హొస్పేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 23న ఉచిత ఆయుర్వేద చికిత్స శిబిరం నిర్వహిస్తున్నాట్లు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.మునివాసుదేవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద శిబిరంలో తుంటి నొప్పి, మెడ, భుజం, వెన్నునొప్పులు, మోకాలి నొప్పి న్యూరోసిస్, ఆర్థరైటిస్ తదితర దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారికి అనుభవజ్ఞులైన వైద్యులతో ఉచిత పరీక్షలు, చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. యోగా, ఆసనాలపై మార్గదర్శకత్వం, ఆరోగ్య స్థితిని బట్టి ఉచిత ఆయుర్వేద ముందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అసక్తి గలవారు 9535981085 నంబరుకు ఫోను చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

భార్య, అత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం

గంగవతి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్య, అత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు భర్త. కొప్పళ పట్టణంలో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు కరటగి తాలూకాలోని సిద్ధాపూర్‌కు చెందిన చిరంజీవి, రోజాకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో కోర్టులోని మధ్యవర్తిత్వ సెంటర్‌లో వివాహ వివాదంపై కౌన్సెలింగ్‌కు వెళ్లక ముందే చిరంజీవి తన బ్యాగులో పెట్రోల్ బాటిల్ తెచ్చుకుని వెనకవైపు నుంచి వచ్చి భార్య రోజా, అత్త శాతమ్మ, మామ శంకరప్పపై పోసి నిప్పు అంటించే ప్రయత్నం చేశాడు. స్థానికులు అతడిని అడ్డుకున్నారు. వెంటనే చిరంజీవిని కొప్పళ నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ ఐక్యతకు విద్యార్థుల కవాతు

- ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



యూనిటీ వాక్‌ను ప్రారంభిస్తున్న శాసనమండలి సభ్యుడు సతీశ్

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వజయంతి వేడుకల్లో భాగంగా కేంద్రప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ కేంద్రం సర్దార్ 150 యూనిటీ వాక్‌ను నిర్వహించింది. శాసనమండలి సభ్యుడు వై.ఎం.సతీష్, మేయర్ పి.గాదెప్ప యూనిటీ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బళ్లారిలోని 15కి పైగా కళాశాలల విద్యార్థులు, యువత, ప్రజలు వెయ్యిమందికిపైగా పాల్గొన్నారు. మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన నడకలో యువకుల బృందం నగరంలోని ప్రధాన రహదారులపై జాతీయ జెండాను పట్టుకుని నినాదాలు చేస్తూ నడిచారు. గడిగి చెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డు, తేరు వీధి, జైన్ మార్కెట్, గవియప్ప సర్కిల్ మీదుగా రంగ మందిరానికి చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్ వన్ ఇండియా ఆలోచనను నేటి యువతరానికి ఈ నడక ద్వారా తెలియజేశారు. విడిపోయిన అన్ని రాష్ట్రాలను ఆయన తన సామర్థ్యంతో ఏకం చేశారని ఆయన మర్చిపోలేనని అన్నారు. డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ మన ప్రాంతం హైదరాబాద్ నిజాం పాలనలో ఉండేదన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటికీ మనకు రాలేదన్నారు. పటేల్ వల్ల మనకు నిజాం నుంచి స్వేచ్ఛ లభించిందన్నారు. పటేల్ ఆదర్శాలను మనమందరం సాకారం చేసుకోవాల్సిన అవసం ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, రామలింగప్ప, గురులింగనగౌడ, వెంకటరమణ, శ్రీనివాస్ మోత్కార్, వాణిజ్య మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, నెహ్రూ యువ కేంద్రం అధికారి సంజీవబుక్కా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న జనవాది సంఘం సభ్యులు

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా బెల్తంగడి తాలూకా ధర్మస్థల గ్రామంలో అనుమానస్పద మరణాలు, హత్యకేసులకు సంబంధించి సంతకాల సేకరణ చేసి బుధవారం జిల్లా కలెక్టర్ సిబ్బంది ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించామని అఖిల భారత జనవాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సంతకాల సేకరణ ప్రచారంలో భాగంగా బళ్లారి జిల్లా జనవాది మహిళా సంఘం 555 సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించామన్నారు. జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ, కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్ శుభ్రతలో వ్యాపారుల సహకారం అవసరం

- కార్యదర్శి జయకుమార్



కార్యదర్శితో వాగ్వాదం చేస్తున్న వ్యాపారులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మార్కెట్ శుభ్రతలో వ్యాపారుల సహకారం అవసరమని ఏపీఎంసీ సెక్రటరీ జయకుమార్ అన్నారు. కూరగాయల దిన మార్కెట్ వ్యాపారుల కోసం ప్రత్యేకంగా ఆదివారం సంత కోసం నిర్మించినట్లు తెలిపారు. కూరగాయల వ్యాపారులు అందులోకి వెళ్లడానికి ఇష్టపడడం లేదని, దీంతో రోజూ టన్నుల కొద్దీ కూరగాయల వ్యర్థాల ద్వారా మార్కెట్‌లో అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న ద్వారాన్ని బారికేడ్లతో మూసివేసి వెనుకవైపు నుంచి ప్రజలు మార్కెట్‌కు వచ్చేలా అనకూలం చేస్తున్నట్లు తెలిపారు. తన నిర్ణయానికి అంగీకరించని వ్యాపారులు పెద్ద సంఖ్యలో కార్యాలయంలోకి చొరబడి తనతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్రప్ప జోక్యంతో వ్యాపారులు శాంతించి వారం రోజులు గడువు కోరడంతో పరిస్థితి సద్దుమణిగిందన్నారు.

ఉత్సాహంగా పంచాయతీ అధికారుల క్రీడాపోటీలు

బళ్లారిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో వార్డెన్ కాలేజీ మైదానంలో జడ్పీ, తాలుకా పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. క్రీడలను తాలుకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ ప్రారంభించారు. బళ్లారి తాలుకాలో నుంచి 24 గ్రామ పంచాయతీల అధికారులు పాల్గొన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. సీఈఓ శ్రీధర్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. శరణప్ప, శివన్న, బసవరాజు, సంధ్యారాణి, ప్రభాకర్ పలు గ్రామ పంచాయతీ పీడీవోలు బిల్ కలెక్టర్లు, సిబ్బంది క్రీడల్లో పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న పంచాయతీ అధికారులు, సిబ్బంది



కబడ్డీ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పరన్నమునవల్లి

రెండో పంటకు సాగునీరు ఇవ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే పరన్నమునవల్లి

గంగవతి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రెండో పంటకు సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తు రైతులను మోసగిస్తోందని మాజీ ఎమ్మెల్యే పరన్నమునవల్లి, మాజీ ఎంపీ శివరాంగౌడ్ విమర్శించారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీబీ డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నాయన్నారు. రైతులకు రెండో పంటకు సాగునీరు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. గేట్ల మరమ్మతు పేరుతో రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు మునీరాబాదు నుంచి రాయచూరు వరకు రైతులు ఎంతో ఆశపెట్టుకొని ఉన్నారని అన్నారు. ఒకవేళ నీరు వదలకపోతే పశువులకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని, రైతులు, రైతు కూలీలు, కార్మికులు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వలస పోవాల్సి ఉంటుందన్నారు. రైతుల బాధలను దృష్టిలో ఉంచుకోని రాష్ట్ర ప్రభుత్వం రెండో పంటకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో పంటకు నీరు ఇవ్వకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వీరభద్రప్పనాయక్, నగరసభ మాజీ అధ్యక్షుడు మూలసాబు, పరుశురాం, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

- ఏఐకేకేఎంఎస్ డిమాండ్



నిరసన తెలుపుతున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు

బళ్లారి సిటీ,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బగర్ హుకుం సాగుదారులకు వెంటనే హక్కు పత్రాలు పంపిణీ చేయాలని బుధవారం తాలూకా అధికారుల కార్యాలయం వద్ద ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ బళ్లారితో సహా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో లక్షలాది మంది రైతులు ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్నారన్నారు. 60-70 సంవత్సరాలుగా ఈభూమిలో పంటలు పండిస్తున్నారన్నారు. వారి జీవనోపాధితోపాటు ప్రజల ఆకలిని తీరుస్తున్నారన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతప్ప మాట్లాడుతూ రైతుల అవసరాలను గ్రహించిన ప్రభుత్వాలు వారికి హక్కు పత్రాలు అందిస్తాయని హామీ ఇచ్చాయని, అయితే ఇంతవరకు ఇచ్చినపాపాన పోలేదన్నారు. ఇటీవల ఉపగ్రహాల ద్వారా టైటిల్ పత్రాలు పంపిణీ చేయడానికి సర్వే చేయడం, కొన్నిచోట్ల ఈసాగుదారుల దరఖాస్తులు ఎటువంటి కారణం లేకుండా తిరస్కరించారని విమర్శించారు. ఇతర సమస్యల కారణంగా వారికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. చట్టబద్ధంగా సాగు చేస్తున్న భూమికి వెంటనే టైటిల్ డీడ్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గురిల్లిరాజా మాట్లాడుతూ బగర్ హుకుం సాగుదారులకు వెంటనే టైటిల్ డీడ్లు జారీ చేయాలని, ఉపగ్రహం ద్వారా సర్వే చేయడానికి బదులుగా ప్రత్యక్ష సర్వే చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రాందాస్, మల్లప్ప, తిప్పయ్య పాల్గొన్నారు.

సేవా ప్రదాతల గురించి తెలుసుకోవాలి

- లీడ్ బ్యాంక్ మేనేజర్ గిరీష్ కులకర్ణి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ గిరీష్ కులకర్ణి

బళ్లారి సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యాపార అభివృద్ధి, సేవా సంస్థలు అందించే సౌకర్యాల గురించి తెలుసుకోవాలని లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గిరీష్ కులకర్ణి అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పారిశ్రామిక కేంద్రంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయ హాల్లో ర్యాంప్ పథకం కింద వ్యాపార అభివృద్ధి సేవా ప్రదాతల పథకంపై కర్ణాటక ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య శాఖ, జిల్లా పారిశ్రామిక కేంద్రం నిర్వహించిన ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేఎస్ఎఫ్‌కి చెందిన డాక్టర్ చంద్రప్ప వ్యాపార అభివృద్ధి సేవా ప్రదాతల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్(బీడీఎస్‌పీ) సౌకర్యాలు విజయగాధల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్, డైరెక్టర్ రాజసాబ్, రిసోర్స్ పర్సన్ ప్రసన్న, సీడీఏసీ శిక్షణ అధికారి వినోద్ కుమార్, జడెప్ప పాల్గొన్నారు.

హోసూరు జోన్

శానమావులో 40కిపైగా ఏనుగులు



ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీ అధికారులు

హోసూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొరుగున కర్ణాటక నుంచి వలస వచ్చిన 40కి పైగా అడవి ఏనుగులు ఉడేదుర్గం అటవీ ప్రాంతంలో విడిది చేశాయి. మంగళవారం వలస వచ్చిన ఏనుగుల మంద హోసూరు సమీపంలోని శానమావు అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. శానమావులోని సంపత్‌పారై అనే ప్రాంతంలో ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఏనుగుల కదలికలపై హోసూరు ఫారెస్ట్ రేంజర్ పార్థసారథి నేతృత్వంలో పర్యవేక్షిస్తోంది. ఫలితంగా శానమావు, బీర్జేపల్లి, బెన్నేకల్, నాయకనపల్లి, పోడూరు, అళియాళం గ్రామస్తులను అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరించింది. ప్రతి సంవత్సరం ఈ ఏనుగులగుంపు జవలగిరి గుండా డెంకణీకోట, నొగనూరు ఉడేదుర్గం, శానమావు, శెట్టిపల్లి, శూలగిరి మీదుగా మహారాజగడ అటవీ ప్రాంతానికి, ఆంధ్రప్రదేశ్‌లోని కౌండియా అభయారణ్యం, శ్రీవెంకటేశ్వర అభయారణ్యానికి ప్రయాణించి ఏప్రిల్, మే నెలల్లో తిరిగి వెళుతుంది. ప్రతి సంవత్సరం 200 కి పైగా ఏనుగులు వస్తాయి. ఈ సంవత్సరం బుధవారం మొదటిదశలో 40 ఏనుగులు వచ్చాయి. హోసూరు ఫారెస్ట్ రిజర్వ్‌లో శాశ్వతంగా ఉండే 100 కంటే ఎక్కువ ఏనుగులు కొన్ని ప్రదేశాలలో గుంపులుగా, జంటలుగా సంచరిస్తాయి. హోసూరు చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం రాగులు పంట కోతకు వచ్చింది. టమోటాలు, వరి, కీరదోస, క్యాబేజీ, బీన్స్, వంటి వాణిజ్య పంటలు, కూరగాయలు పెద్ద మొత్తంలో పండిస్తున్నారు. ఏనుగుల వల్ల పంటలు సంరక్షించుకోవడం గ్రామస్తులకు సవాల్‌గా మారింది.

ఎంపీకి సన్మానం



ఎంపీ గోపినాథ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హోసూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి కాంగ్రెస్ ఎంపీ గోపినాథ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన మద్దతుదారులు, అనుచరులు ఆలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట మారియమ్మ ఆలయం, చంద్రచూడేశ్వర ఆలయం, వరసిద్ది వినాయక ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన అనుచరులు అన్నదానం చేశారు. టీవీఎస్ మోటర్ కర్మాగారం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కుప్పుస్వామి ఎంపీని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ చైర్మెన్ మునిరాజు, సెక్రటరీ సెందిల్‌కుమార్, వైస్ చైర్మన్ కన్నన్, జాయింట్ సెక్రటరీ రాజా, కోశాధికారి రాఘవేంద్రన్, కౌన్సిల్ సభ్యురాలు భాగ్యలక్ష్మి అన్నాదురై తదితరులు ఎంపీ గోపీనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

డీఎంకే కార్యాలయంలో సమావేశం

హోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హోసూరు డీఎంకే తరపున 4 వార్డుల సర్కిల్ కార్యదర్శుల సమావేశం నగర డీఎంకే కార్యాలయంలో జరిగింది. సమావేశానికి డీఎంకే కార్యదర్శి, హోసూరు నగర మేయర్ సత్య అధ్యక్షత వహించారు. మున్సిపల్ కౌన్సిల్ చైర్మెన్ సెందిల్‌కుమార్ అందరినీ స్వాగతించారు. ఏరియా కార్యదర్శులు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, వెంకటేశ్, రాము నాయకత్వం వహించారు. డీఎంకే యువజన కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ జన్మదిన వేడుకల గురించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ గురించి వివరంగా చర్చించారు. పార్టీ అభివృద్ధి పనులపై కూడా చర్చించారు.



మాట్లాడుతున్న మేయర్ సత్య

తగ్గిన పూల ధరలు

హోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో సీజన్ ప్రకారం కూరగాయలు, వివిధ రకాల పూలు, గులాబీలు పండిస్తున్నారు. ఇక్కడ సాగు చేసిన పూలను హోసూరు పూల మార్కెట్‌కు తీసుకువెళతారు. అక్కడి నుంచి తమిళనాడుకు మాత్రమే కాకుండా కర్ణాటక, కేరళకు కూడా ఎగుమతి చేస్తారు. కార్తీక మాసం, శబరిమలకు భక్తులు వెళ్లే సీజన్ ఇది. కెలమంగలం, ఉద్దన్నపల్లి బాగలూరు, డెంకణీకోట ప్రాంతాలలో బంతి పువ్వులు ఎక్కువగా పండిస్తారు. అకస్మాత్తుగా డిమాండ్ తగ్గడంతో హోసూరు పూల మార్కెట్‌లో ధరలు తగ్గాయి. గత ఏడాది ఈ సీజన్‌లో రోజాపూలు కిలో రూ.300-రూ.120 వరకు, సంపంగి రూ.200 వరకు పలికింది. ప్రస్తుతం సంపంగి రూ.40, బంతిపూలు రూ.30 పలుకుతోంది. ధర మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కులగణన ప్రారంభం



ధ్రువీకరణ పత్రం చూపుతున్న నేకార సంఘం పదాధికారులు

బళ్లారి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర చేనేత సంఘాల సమైక్య నేతృత్వంలో కులగణన సర్వే ప్రారంభమైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. నగరంలోని పత్రికా భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల శాశ్వత కమిషన్ జారీ చేసిన కులగణన వేదిక చేనేత కార్మికుల సంఘానికి తీవ్ర ఇబ్బందిని కలిగించిందన్నారు. చేనేత కార్మికుల సంఘం జనాభా నివేదికలో తప్పుగా నమోదు చేసింది, అది సంఘం హక్కుల సౌకర్యాలు, రాజకీయ ప్రతిధ్వనిపై ప్రభావం చూపుతుందని అన్నారు. మొదట్లో దాగి మఠాధిపతులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు సహా అనేక సమావేశాల ద్వారా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కమ్యూనిటీ ఖచ్చితమైన సమాచారాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని చేనేత కార్మికుల సంఘాలు తమ కుటుంబ వివరాలను సమర్పించడానికి వీలు కల్పిస్తుందని, జిల్లా, నియోజకవర్గాల వారీగా అధ్యక్షులు, వివరాలను తెలుసుకునేందుకు అనుకూలంగా వుంటుందన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్ దేవానంద్, మంపూనాథ్, అన్నయ్య, శివప్ప, జగదీష్, వీరేష్, శ్రీరామరాజు పాల్గొన్నారు.